▬▬▬▬*********▬▬▬▬

# మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా ప్రథమ వార్షికోత్సవ ప్రసంగం

తేదీ: 11-10-2017.

## శ్రీ తలసాని శ్రీనివాస్ యాదవ్ గారు

రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు

▬▬▬▬*********▬▬▬▬

మేడ్చల్ జిల్లా ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పుర ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, సిబ్బందికి, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

గత సంవత్సరం అక్టోబరు 11న తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సరికొత్త పుటలు తెరుచుకున్నాయి. అరవిరిసిన పూలరేకుల్లాంటి 21 నూతన జిల్లాలతో కలిపి రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 31కి చేరింది. పాలనా వ్యవస్థలో భారీ అధికార వికేంద్రీకరణ జరిగి 31 జిల్లాలుగా ఆవిర్భావించాయి. నూతన జిల్లాల ఏర్పాటు వల్ల ప్రజలకు సుపరిపాలన అందాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిన్న జిల్లాల ఏర్పాటుకు పూనుకున్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల దరికి చేరేందుకు చిన్న జిల్లాల ఏర్పాటు వల్ల సాధ్యమవుతుంది. చిన్న జిల్లాల ఏర్పాటు వల్ల విస్తీర్ణం తగ్గి అధికారుల పరిధి తగ్గి ప్రజలకు విస్తృతంగా సేవలు అందించేందుకు వీలు కలుగుతుందున్న ఉద్దేశంతో ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను చేపట్టింది. జిల్లా కలెక్టరుతో పాటు రెవెన్యూ, వివిధ శాఖలు ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా అన్ని రంగాలలో అభివృద్ధి పరిచేందుకు వీలు కలుగుతుంది.

దీనికి అనుగుణంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆవిర్భవించి ప్రజల అవసరాలు, ఆకాంక్షలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా ప్రగతిబాటలు వేయడం జరిగింది. జిల్లా ఆవిర్భావం అనంతరం అధికార యంత్రాంగాన్ని ఒక తాటిపైకి తీసుకురావడంతో పాటు వివిధ శాఖల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. కొన్ని చిన్న చిన్న సమస్యలు ఉన్నప్పటికీ పరిపాలనను మరింత దగ్గరకు తీసుకొచ్చి సమస్యల పరిష్కారానికి నడుం బిగించాం. తద్వారా ప్రభుత్వ పరిపాలనపై ప్రజలకు విశ్వాసాన్ని కలిగిస్తున్నాం.

నేడే సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ సముదాయానికి శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లి గ్రామంలో శంకుస్థాపన చేయడం జరిగింది.

గత సంవత్సర కాలంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మిషన్ భగీరథ కింద ఇంటింటికి నల్లా ద్వారా గోదావరి నీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇళ్లులేని పేద కుటుంబాలకు 25వేల డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. 16వేల ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. కేసీఆర్ కిట్ కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేసుకున్న 733 మంది బాలింతలకు కేసీఆర్ కిట్‌లను పంపిణీ చేయడం జరిగింది.

ఒంటరి మహిళల పెన్షన్‌ల కింద 4 వేల మంది నిరాధారమైన మహిళలకు ప్రతినెల వెయ్యి రూపాయల పెన్షన్‌లను అందిస్తున్నాం. జిల్లాలో అతిపెద్ద ప్రజాపంపిణీ వ్యవస్థను అమలు పరుస్తూ 16 లక్షల మంది జనాభాకు రేషన షాపుల ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నాం. జిల్లాలోని 77 గ్రామ పంచాయితీలలో టాయిలెట్లు లేని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించి స్వచ్ఛ మేడ్చల్ జిల్లాగా రూపాంతరం చెందేలా చర్యలు తీసుకున్నాం. ఆడపడుచులకు దసరా కానుకగా 4.53 లక్షల మందికి బతుకమ్మ చీరలను పంపిణీ చేశాం. యాదవ, కురువ, గొల్ల వారి ఆర్థికాభివృద్ధికి గొర్రెల అభివృద్ధి పథకాన్ని అమలులోకి తెచ్చి 1672 యూనిట్లను మంజూరు చేశాం. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ కింద పేదింటి ఆడపడుచుల వివాహం భారం కాకూడదన్న ఉద్దేశంతో 2వేల మంది ఆడపడుచుల వివాహాలకు 10 కోట్ల రూపాయలను అందించడం జరిగింది. మత్స్య సంపదను పెంపొందించేందుకు గాను ఈ సంవత్సరం 1 కోటి 15 లక్షల చేప పిల్లలను చెరువులలో వదిలి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోనున్నాం. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు వీలుగా హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్ష్యానికి మించి ఈ సంవత్సరం 47 లక్షల మొక్కలు నాటాం.

హైదరాబాద్ మహానగరంలో కూరగాయలు, పండ్లు, పూలకు ఉన్న డిమాండ్

దృష్ట్యా మేడ్చల్ జిల్లా రైతులకు మంచి భవిష్యత్తు ఉంది. ఉద్యాన, పాడి రైతులకు పలు రాయితీలు కల్పించేందుకు వీలుగా 600 కోట్లతో రుణ ప్రణాళికలు రూపొందించడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి అనేక సబ్సిడీలతో కూడిన యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

రాబోయే కాలంలో ఇదే విధంగా అందరం కలిసి సమాలోచనలు, సమీక్షలు చేసుకుంటూ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తూ వెళ్దామని, బంగారు తెలంగాణ సాధనలో మీ అందరి సహకారం ఉంటుందని ఆశిస్తూ... అభివృద్ధిలో అందరూ భాగస్వాములై తమ వంతు సహాయ, సహకారాలు, సూచనలు అందజేయాల్సిందిగా ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

**.. జైహింద్ ..**